అనిపిస్తుంది చూసేవాళ్ళకి. ఏప్రిల్ ఒకటి రెండేళ్ళు చిన్నదై వుండవచ్చు. మేరీ అంత పొడుగు లేకపోయినా ఏప్రిల్ కూడా పొడగరే. వెండి, బంగారం కలిసిన మిశ్రమంలాంటి జుట్టుతో, ముదురునీలం రంగు కళ్ళతో, పాలిపోయినట్లు గాక కొంచం ఎరుపు కలిసిన తెలుపు రంగుతో ఏప్రిల్ అందంగా వుంటుంది. రూబీ పోలికలు కొన్ని ఆమెలో వున్నట్లు గమనించింది హిమ.

ఇద్దరూ నలుపురంగు బట్టలు వేసుకున్నారు, రూబీ మరణానికి దుఃఖసూచనగా కాబోలు!

మేరీ బ్లాక్ సూట్, మెడకు నల్లటి స్కార్ఫ్, కాళ్ళకు నల్లటి షూసూ వేసుకుంది. హాండ్ బ్యాగ్ కూడా నలుపే.

ఏప్రిల్ బ్లాక్ స్కర్ట్, లేతరంగు బ్లౌజు దానిపైన బ్లాక్ బ్లేజర్ వేసుకుంది. పొడవాటి జుట్టును పైకి దువ్వి, నల్లటి రిబ్బన్ తలకు కట్టుకుంది.

అక్కచెల్లెళ్ళిద్దరిలోకీ మేరీ మాటకారి, గడసరి. మాటల్లో ఇద్దరికీ పెళ్ళికాలేదని, చేసుకునే వుద్దేశ్యం లేదని, ఇద్దరూ కలిసివుంటున్నారని, బాదరబందీ లేకుండా చక్కగా రకరకాల ప్రదేశాలు చూసి ఆనందించటం తమ హాబీ అని చెప్పింది మేరీ. చెల్లెలి తరపున కూడా ఆమె ఇష్టాలూ, అభిరుచులూ తనే చెప్పింది.

ఏప్రిల్ అతినెమ్మదిగా, అమెరికన్లలో అసాధారణంగా కనిపించింది హిమకు. అక్క చెప్పే మాటలను అతి శ్రద్ధగా వింటూ కూర్చున్న ఏప్రిల్ ముఖంలోని భావాలను చదవాలని ప్రయత్నించింది. ఎందుకో, ఆమె ముఖం చూస్తుంటే మేరీ ప్రక్కన లేనప్పుడు ఎవరైనా అడిగితే, ఆమె చెప్పిన వాటికన్నిటికీ వ్యతిరేకంగా తన అభిప్రాయాలు చెబుతుంది, అనిపించింది హిమకు.

మాటల్లో అరగంట గడిచిపోయింది. టైమ్ చూసుకుంటూ, "అరె, వచ్చి అరగంట దాటిపోయింది. ఈ లాయరుకు డబ్బు సంపాయించటమే గాని పంక్చువాలిటీ అస్సలు తెలియదులా వుంది. తమ సమయమే అతి విలువైనదనీ, మిగతావాళ్ళంతా పనీపాటూ లేకుండా తిరుగుతారని వీళ్ళ అభిప్రాయం కాబోలు!" అంటూ విసుక్కుంది మేరీ.

అక్కడికి దగ్గరలోనే కౌంటర్ దగ్గర కూర్చుని ఏదో వ్రాసుకుంటున్న రిసెప్షనిస్టు, మేరీ మాటలు వినబడే ఏమో కొద్దిగా తలెత్తి చూసిమళ్ళీ వ్రాసుకోవటంలో మునిగిపోయింది.

ఇంతలో ఫోను బజ్జర్ మోగటంతో రిసీవర్ ఎత్తింది. ఏదో మాట్లాడి ఫోను పెట్టేసి, వీళ్ళు కూర్చున్న చోటుకి వచ్చింది. పేరు పేరునా హిమను, మేరీని, ఏప్రిల్‌ని పిలిచి, "లాయర్ ఇప్పుడు మిమ్మల్ని చూస్తారు. ఇలా లోపలికి వెళ్ళండి" అని దారి చూపించింది. శకుంతల కూడా వాళ్ళతో పాటు లోపలికెళ్ళింది.

లాయర్, వీళ్ళను చూడగానే మర్యాదగా లేచినుంచొని తనను తను పరిచయం చేసుకుని, వాళ్ళకు కూర్చునేందుకు కుర్చీలు చూపించాడు.

మేరీ ముఖం ఎందుకనో అంతకుముందు కంటే అప్రసన్నంగా వుంది. శకుంతల ఆమెను గమనిస్తూనే వుంది. ఎప్పుడైతే రిసెప్షనిస్టు హిమ పేరుకూడా పిలిచిందో అప్పుడే మేరీ ముఖంలో మార్పు వచ్చింది. అంతవరకూ, హిమ లాయరుతో మరేదో పనుండి వచ్చిందనుకుంది కాబోలు. అంతవరకూ, నవ్వుతూ కబుర్లు చెబుతున్న ఆవిడముఖం చిటపటలాడటం చూస్తే నవ్వొచ్చింది శకుంతలకు.

లాయర్ ఏవో కాగితాలు సర్దుతూ కాస్సేపు టేబుల్ దగ్గర కూర్చున్నాడు. ఈ లోపల గదంతా పరిశీలనగా చూస్తూ కూర్చుంది హిమ.

ఖరీదైన 'మహాగనీ' ఫర్నిచర్ ప్రతిబింబం చూసుకోవచ్చేమో అన్నంతగా నిగనిగా మెరుస్తోంది. ఒకవైపున గోడంతటావున్న షెల్ఫుల నిండా రకరకాల లా పుస్తకాలు నీటుగా సర్దివున్నాయి. లాయరు కూర్చున్నవైపు గోడమీద ఆయన సంపాయించుకున్న డిగ్రీలు, సర్టిఫికెట్లు ఫ్రేములుకట్టి వేలాడుతున్నాయి. ఒకవైపున గోడంతా ఆక్రమించుకున్న గ్లాస్ విండో, దానికి వ్రేలాడుతూ అటూ ఇటూ మడిచికట్టిన సిల్కుతెరలు, విండోసిల్ మీద రకరకాల మొక్కలు గదంతటికీ అందాన్నిస్తున్నట్లుగా వున్నాయి.

గది అందాన్ని గమనిస్తూ కూర్చున్న హిమ లాయర్ మాటతో తలతిప్పి చూసింది.

(సశేషం)

కలమదాటని కథ

గ్రీటింగ్స్

సుబ్బారావుకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. గుర్నాథం ఇంతపని చేస్తాడా?

మిత్రబృందంలో అందరికీ గ్రీటింగ్స్ పంపి తనకే పంపడా?

గుర్నాథం మరోచోటికి బదిలీ అయిపోయిన తర్వాత తమ అందరికీ ఉత్తరాలు రాశాడు. అఫ్‌కోర్స్ తన పోస్ట్ పోవింగ్ నేచర్ వలన తాను మిత్రులందరిలా వెంటనే తిరుగు రిప్లై ఇవ్వలేదు. అయితే మాత్రం మిత్రులందరిలో ఇంత అవమానిస్తాడా?

అతను బదిలీ అయి వెళ్ళబోయే ముందు తను ఎంత ఇనీషియేటివ్ తీసుకుని • అతనికి సెండాఫ్ పార్టీ జరిపించాడు. ఆ మాత్రం ఆలోచించలేకపోయాడా? కృతఘ్నుడు.

ఇప్పుడు ఏం చేయాలి? ఏం చేయాలి?

***

గుర్నాథం జుట్టుపీక్కుంటున్నాడు..... కారణం... కొత్త సంవత్సరం మొదటి రోజున పోస్ట్‌లో వచ్చిన గ్రీటింగ్ కార్డ్ భార్య రిసీవ్ చేసుకుని చదివి ముఖం అదోలా పెడుతూ భర్తకు ఇచ్చింది.

గ్రీటింగ్ సుబ్బారావు దగ్గరనుండి. ఒక కాకి బొమ్మ! ఆ క్రింద అందమయిన అక్షరాల్తో.

డియర్ గుర్నాథం... నువ్వు మన మిత్రులందరికీ గ్రీటింగ్ కార్డ్స్‌పంపి నాకు పంపనంత మాత్రాన నేను నీకు గ్రీటింగ్స్ పంపకుండా ఎలా వుంటాను? అలాగని నేను నిన్ను ఇన్‌సల్ట్ చేస్తున్నాననుకోకు. ఏది ఏమయినా నువ్వు మన మిత్రులందరికీ నాలుగు రోజులు ముందుగానే గ్రీటింగ్స్ పంపడం వలన నాకీ అవకాశం చిక్కింది.

మొత్తంమీద నీకు నా నూతన సంవత్సర శుభాకాంక్షలు!!

-సుబ్బారావు

—తొమ్మండ్రు రాజేంద్ర ప్రసాద్